ప్రజాశక్తి
శనివారం 26 జూలై 2025
5
శ్రీకాకుళం



ఆర్‌టిసిలో అప్రెంటిస్‌కు దరఖాస్తుల స్వీకరణ

శ్రీకాకుళం సిటీ : ఆర్‌టిసిలో అప్రెంటిస్‌షిప్‌కు జిల్లా పరిధిలోని ఐటిఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు (డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ట్రేడ్‌లు) దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి ప్రజా రవాణాధికారి హనుమంతు అమరసింహుడు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆగస్టు తొమ్మిదో తేదీ లోపు www.apprenticeshipindia.gov.on వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలతో ఆగస్టు 14వ తేదీన ఉదయం పది గంటలకు ఆర్‌టిసి జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ, వి.టి అగ్రహారం, విజయనగరం హాజరు కావాలని తెలిపారు. ఇప్పటికే ఎంపికై, అప్రెంటిస్ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేయరాదని స్పష్టం చేశారు.

మరిన్ని వివరాలకు 08922 294906 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

ఆ విచారణ అటకెక్కినట్టేనా..?

- డిఇఒపై వచ్చిన ఆరోపణలపై విచారణకు కలెక్టర్ ఆదేశం
- విచారణాధికారిగా స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ పద్మావతి నియామకం
- పక్కా ఆధారాలు సమర్పించిన ఉపాధ్యాయ సంఘాలు
- రెండున్నర నెలలు గడిచినా డిఇఒ తిరుమల చైతన్యపై చర్యలు శూన్యం

జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్యకు ఉపాధ్యాయ సంఘాలతో తొలి నుంచీ పొసగడం లేదు. జిల్లా విద్యాశాఖాధికారిగా ఆయన బాధ్యతలు స్వీకరించిన తర్వాత పాఠశాలలను సందర్శించడం, ఏదో సాకుతో ఉపాధ్యాయులను సస్పెన్షన్ చేయడం అలవాటుగా మార్చుకున్నారన్న ఆగ్రహం వారిలో గూడు కట్టుకుని ఉంది. ఎచ్చెర్ల మండలం కుప్పిలిలో పదో తరగతి పరీక్షల సమయంలో 14 మంది ఉపాధ్యాయులు, సిబ్బందిని సస్పెండ్ చేయడంతో వారిలో కోపం మరింత కట్టలు తెంచుకుంది. డిఇఒ నిరంకుశ వైఖరితో తిరగబడ్డ ఉపాధ్యాయులు పలురూపాల్లో నిర్వహించిన ఆందోళనలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ఆ నేపథ్యంలోనే ఉపాధ్యాయుల బదిలీలు, కెజిబివి పోస్టుల భర్తీ, టెండర్లలో అవకతవకలు, అవినీతిలో డిఇఒ పాత్రపై ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై విచారణకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ ఏడాది మేలో విచారణకు ఆదేశించారు. విచారణ ముగిసి రెండున్నర నెలలు గడుస్తున్నా, దానికి అతీగతీ లేకుండా పోయింది.



జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

తిరుమల చైతన్యపై పలు ఆరోపణలతో ఉపాధ్యాయ సంఘాలు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఈ ఏడాది మార్చి 27న ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణకు భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతిని విచారణ అధికారిగా కలెక్టర్ నియమించారు. ఆమె ఈ ఏడాది మే ఐదో తేదీన విచారణ చేపట్టారు. విచారణ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నేతలు డిఇఒ తిరుమల చైతన్యపై చేసిన ఆరోపణకు సంబంధించి రాతపూర్వకంగా అన్ని ఆధారాలనూ సమర్పించారు. అందులో మొదటి అంశంగా 2023 ఉపాధ్యాయుల బదిలీల్లో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలను పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఏ కారణం చేతనైనా ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు హాజరు కాలేని పక్షంలో మాన్యువల్‌గా ఉత్తర్వులు ఇచ్చినప్పుడు లెఫ్ట్ ఓవర్ వేకెన్సీస్ ఇవ్వాలని కానీ, డిఇఒ తిరుమల చైతన్య నిబంధనలకు విరుద్ధంగా పది శాతం బ్లాక్‌డ్ వేకెన్సీస్‌లో ఉత్వరులు ఇచ్చారని విచారణ అధికారికి వివరించారు. ఇందుకు సంబంధించిన ఆర్డర్ కాపీని ఆమెకు అందించారు. ఇందులో పెద్దఎత్తున అవినీతి చోటుచేసుకుందని తెలిపారు. అదేవిధంగా మెడికల్ గ్రౌండ్స్‌పై సెల్ఫ్ లేదా స్పౌజ్, డిపెండెంట్స్ ప్రిఫరెన్స్ కేటగిరీని జిల్లా బదిలీ కమిటీకి పంపకుండా కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు పంపి ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేశారని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అకడమిక్ సంవత్సరం పూర్తి కాకుండా తిరిగి నియామకానికి గురైన ఉపాధ్యాయునికి స్పెషల్ పాయింట్స్ ఇవ్వాల్సి ఉన్నా, ఎస్‌టియు రాష్ట్ర బాధ్యులు పి.ప్రభాకరరావుకి యూనియన్ పాయింట్స్ (5) ఇవ్వకుండా కాలయాపన చేసి కక్షసాధింపునకు పాల్పడ్డారని ఆమెకు వివరించారు.

కెజిబివి పోస్టుల భర్తీలో నిబంధనల ఉల్లంఘన

కెజిబివిల్లో బోధన, బోధనేతర పోస్టుల భర్తీకి ప్రభుత్వం 2024లో ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థుల విషయంలో నిబంధనల ప్రకారం రోస్టర్ పాయింట్ల పద్ధతిని పాటించకుండా నియామకాలు చేసి అవకతవకలకు పాల్పడ్డారని డిప్యూటీ కలెక్టర్‌కు వివరించారు. అందుకు సంబంధించిన మెరిట్ జాబితాను ఆమెకు సమర్పించారు. 2024 జూలైలో అప్పటి డిఇఒ కె.వెంకటేశ్వరరావు టెక్కలి డివిజన్‌లోని కొత్తూరు మండలం కడుమ స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) ఉపాధ్యాయుడుని శ్రీకాకుళం డివిజన్‌లోని సరుబుజ్జిలి మండలం రొట్టవలస పాఠశాలకు తాత్కాలికంగా డిప్యుటేషన్ వేశారు. 2024 ఆగస్టులో పని సర్దుబాటులో భాగంగా కడుమలో సర్ప్లస్‌గాను రొట్టవలసలో అవసరంగానూ డిఇఒ తిరుమల చైతన్య చూపకపోవడం వల్ల బదిలీల గైడ్‌లైన్స్ మేరకు మండలంలో తెలుగు ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయారని వివరించారు.

కూరగాయల టెండర్లలో అవకతవకలు

2024-25 విద్యా సంవత్సరంలో కెజిబివిలు, మోడల్ స్కూల్స్‌లో కూరగాయల సరఫరాకు వేసిన టెండర్లలో సమగ్ర శిక్షా అభియాన్ ఎపిసిగా ఉన్న డిఇఒ తిరుమల చైతన్య అవినీతి అక్రమాలకు పాల్పడ్డారంటూ ఆరోపించారు. ఇందుకు సంబంధించి పత్రికల్లో వచ్చిన కథనాల క్లిప్పింగ్స్‌ను అందించారు.

పేరు ప్రతిష్టల కోసమే ఉపాధ్యాయుల సస్పెన్షన్

పదో తరగతి ఇంగ్లీష్ పరీక్ష రోజు కుప్పిలి ఎ సెంటర్, బి సెంటర్‌లో మాల్ ప్రాక్టీస్ ఆరోపణలతో నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు పద్ధతిలో ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడంతో పాటు ఐదుగురిపై క్రిమినల్ కేసులు పెట్టారని చెప్పారు. దీంతోపాటు ఐదుగురు విద్యార్థులను డిబార్ చేశారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో తన పేరు ప్రతిష్టల కోసం డిఇఒ తిరుమల చైతన్య ఇలా వ్యవహరించారని స్పష్టం చేశారు. ట్రిపుల్ ఐటిలో సీట్ల కోసం ఉపాధ్యాయులు విద్యార్థుల నుంచి రూ.30 వేల నుంచి రూ.50 వేలు వసూలు చేశారంటూ నిరాధార ఆరోపణలు చేస్తూ మీడియాకు చెప్పారని ఆమెకు వివరించారు. తాము కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో చర్చల సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో నేరుగా మాట్లాడి వాస్తవాలను తెలుసుకున్న తర్వాతే కలెక్టర్, ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తేశారని ఆమెకు వివరించారు. ఇందులో అసలు దోషి డిఇఒ తిరుమల చైతన్య అని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పోస్టాఫీసులో సైబర్ మోసం

- రూ.2.78 కోట్ల డిపాజిట్ల గల్లంతు
- ఆలస్యంగా వెలుగుచూసిన వైనం
- ఐదుగురు సిబ్బంది సస్పెన్షన్
- ఆందోళన చెందుతున్న డిపాజిట్‌దారులు
- సిబిఐకి దర్యాప్తు అప్పగింత



డిపాజిట్‌దారుల నుంచి వివరాలను సేకరిస్తున్న పోస్టల్ అధికారి

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పోస్టాఫీసులో సైబర్ మోసం చోటుచేసుకుంది. రూ.2.78 కోట్ల డిపాజిట్లు గల్లంతయ్యాయి. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన కలకలం సృష్టించింది. తమ కష్టార్జితం గల్లంతైందన్న విషయం తెలుసుకున్న డిపాజిట్‌దారులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే ఐదుగురు సిబ్బందిని సస్పెండ్ చేశారు. డిపాజిట్‌దారుల డిపాజిట్ మొత్తాలు ఆన్‌లైన్‌లో క్లోజ్ అయినట్లు గుర్తుతెలియని డిపాజిట్‌దారుడు పోస్టల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన పోస్టల్ అధికారులు 33 ఖాతాల్లో 20 మందికి చెందిన రూ.2.78 కోట్లు గల్లంతైనట్లు గుర్తించారు. డిపాజిట్ గల్లంతైన బాధిత డిపాజిట్‌దారులను పోస్టల్ అధికారులు శుక్రవారం పిలిపించి వారి స్టేట్‌మెంట్‌ను నమోదు చేశారు. ఈ ఘటనలో ప్రమేయమున్న ప్రాథమికంగా గుర్తించిన ఐదుగురిని ఇప్పటికే పోస్టల్ అధికారులు సస్పెండ్ చేశారు.

ఆందోళన చెందొద్దు

సోంపేట, శ్రీకాకుళం పోస్టల్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్, కమలహాసన్ విలేకరులతో మాట్లాడుతూ గల్లంతైన డిపాజిట్లకు సంబంధించి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. డిపార్ట్‌మెంట్‌కి తెలియకుండా ఈ మోసం జరిగిందని, ఆన్‌లైన్ లావాదేవీల్లో గల్లంతు కావడం గుర్తించామని తెలిపారు. పోస్టల్ సూపరింటెండెంట్ హరిబాబు 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ ఈ స్కామ్‌లో ప్రమేయమున్న ప్రాథమికంగా ఐదుగురిని గుర్తించామని, వారిని సస్పెండ్ చేశామన్నారు. మరింత లోతుగా విచారణ కోసం ప్రభుత్వం సిబిఐకి దర్యాప్తు అప్పగించిందన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని పోస్టాఫీసుల్లో దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. బాధితులకు డబ్బులు వడ్డీతో సహా వస్తాయని, డిపాజిట్‌దారులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు. గల్లంతైన మొత్తాన్ని సిబ్బంది నుంచి రికవరీ చేస్తామని చెప్పారు.



మానవహారం నిర్వహిస్తున్న పెన్షనర్స్

పెన్షన్ చట్ట సవరణ విరమించుకోవాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

పెన్షన్ చట్టానికి సవరణ ప్రతిపాదనలను విరమించుకోవాలని ఫోరం ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.ఎస్ ప్రసాదరావు, కన్వీనర్ కె.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. పెన్షన్ చట్టానికి సవరణలను నిరసిస్తూ నగరంలోని సూర్యమహల్ కూడలి వద్ద పెన్షనర్స్ అసోషియేషన్ ఆధ్వర్యాన శుక్రవారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఆర్థిక, పెన్షన్ వాలిడేషన్ రూల్స్ సవరణ బిల్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వివక్షతతో కూడిన పెన్షన్ సవరణ ప్రతిపాదనలు విరమించుకోవాలన్నారు. 8వ వేతన సంఘం ఏర్పాటు చేయాలన్నారు. డిఒటి, బిఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్స్ పెన్షన్‌ను రివిజన్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, కార్మిక, పెన్షనర్ల వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై భవిష్యత్‌లో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో రైల్వే, బిఎస్‌ఎన్‌ఎల్, మాజీ సైనికోద్యోగులు, అసోషియేషన్ల నాయకులు పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

పేదల సాగులో ఉన్న ప్రభుత్వ భూములకు పట్టాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగరాపు సింహాచలం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని జాలారి కొయ్యాంలో పేదల అనుభవంలో ఉన్న 40 ఎకరాల ప్రభుత్వ భూమిలో శుక్రవారం నీలగిరి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలైన మత్స్యకారులు, ఇతర సామాజిక తరగతులకు చెందిన పేదలు సెంటు భూమి లేక కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఉపాధి లేక గ్రామంలోని పురుషులు కుటుంబాలను విడిచిపెట్టి సుదూర ప్రాంతాలకు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సముద్ర తీర ప్రాంతంలోని ప్రభుత్వ భూములు కొంతమంది పెత్తందారులు, భూస్వాములు కన్నేశారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి నిరుపేదలైన మత్స్యకారులకు ఆ భూములు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు.



మొక్కలు నాటుతున్న భూ అనుభవదారులు

కార్యక్రమంలో మైలపల్లి తాతారావు, మారుపల్లి రాజు, మారుపల్లి అప్పలరాజు, మైలపల్లి రామారావు, మైలపల్లి వీర్రాజు, మైలపల్లి కొర్లమ్మ, ఎం.లక్ష్మి, ఎం.అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈనెలలోనే అన్నదాత సుఖీభవ

రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి - గార, శ్రీకాకుళం సిటీ

రైతులకు పెట్టుబడి సాయం కింద మూడు విడతలుగా ఏడాదికి రూ.20 వేలను అందజేసే అన్నదాత సుఖీభవ పథకాన్ని ఈనెలలోనే అమలు చేయనున్నట్లు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లాకు వచ్చిన ఆయన అరసవల్లి సూర్యనారాయణ స్వామి, గారలోని శ్రీకూర్మంలో కూర్మనాథ స్వామిని ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నట్లు చెప్పారు. రైతులకు రాజముద్రతో ఉన్న పాసు పుస్తకాలను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటలింగ్ యాక్టును రద్దు చేశామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వనివీ అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అప్పుల్లో ఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఏడాది కాలంలోనే రూ.772 కోట్లతో 9,098 ఆలయాలను పునర్నిర్మాణం చేపట్టామన్నారు. అరసవల్లి ఆలయంలోనూ కొన్ని పునర్నిర్మాణ పనులు చేయాల్సి ఉందన్నారు. ప్రాచీన శ్రీకూర్మం ఆలయం విషయమై ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్‌తో పునర్నిర్మాణంపై మాట్లాడామని, వారు వారం పది రోజుల్లో వచ్చి పరిశీలిస్తామని చెప్పారని తెలిపారు. సమస్యల పరిష్కారానికి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఒక వేదికగా చేసుకొని చిన్న చిన్న సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో అరసవల్లి ఆలయ డిసి కె.ఎన్.వి ప్రసాద్, విశాఖపట్నం డిసి సుజాత, సింహాచలం రీజనల్ జాయింట్ కమిషనర్ త్రినాథ, కనకమహాలక్ష్మి ఆలయ ఇఒ శోభారాణి, గార తహశీల్దార్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



ముందస్తు ప్రణాళికతో ఎరువుల పంపిణీ

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనుల నేపథ్యంలో రైతులకు ఇబ్బంది లేకుండా ఎరువుల పంపిణీ జరగాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. స్థానిక అంబేద్కర్ ఆడిటోరియంలో వ్యవసాయ సంచాలకులు, వ్యవసాయ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, సొసైటీ ప్యాక్ సిఇఒలతో ఎరువుల సరఫరాపై జిల్లాస్థాయి సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం అందుబాటులో 2,400 మెట్రిక్ టన్నుల యూరియా గోడౌన్లలో నిల్వలు ఉన్నాయని తెలిపారు. వీటిని తక్షణమే రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక సహకార పరపతి కేంద్రాలు, ప్రైవేటు ఎరువుల దుకాణాలు, హోల్‌సేల్ ఎరువులు దుకాణాల్లో సరఫరాకు సిద్ధంగా ఉంచనునట్లు తెలిపారు. గ్రామాల్లో రైతులకు ఎరువులు పంపిణీ చేసేందుకు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు కీలకపాత్ర పోషించాలన్నారు. స్లాట్ ప్రకారం కూపన్ పద్ధతిలో సరఫరా చేసే తేదీ, సమయం తెలియజేస్తూ ఎక్కడా సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా ఎరువుల పంపిణీ జరగాలన్నారు. ప్రభుత్వ ధరకు రైతులకు అందించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో కృత్రిమ కొరత రాకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. వరి సాగు ఎకరానికి 50 కేజీల డిఎపి, 75 కిలోల యూరియా మూడుదపాల్లో పొటాషియం 33 కేజీలు శాస్త్రీయంగా అవసరమన్న విషయం రైతులకు అవగాహన ఉండాలన్నారు. ఎరువుల కొరత ఉండొచ్చనే భావనతో అవసరానికి మించి ఎరువులను నిల్వ చేసుకోవద్దని, మూడుదపాలుగా రైతుల అవసరం మేరకు సకాలంలో ఎరువులు అందజేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో వరి నాట్లు వేసిన విస్తీర్ణం, డిఎపి, యూరియా డిమాండ్‌ను గ్రామ వ్యవసాయ సహాయకులు పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు. గోదాములో ఎరువుల నిల్వల వివరాలు మండల వ్యవసాయ అధికారుల వద్ద కచ్చితంగా ఉండాలన్నారు. జిల్లాలో వ్యవసాయ సహాయకుల కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే రైతు సేవా కేంద్రాలు, గ్రామ సచివాలయాల్లో తెలియజేయాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్ కుమార్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి త్రినాథస్వామి, జిల్లా ఇన్‌ఛార్జి సహకార అధికారి బి.మురళీకృష్ణ, డిసిఎంఎస్ బిజినెస్ మేనేజర్ ఎం.జగ్గునాయుడు, ఎఆర్ఎస్ ఆమదాలవలస, రాగోలు శాస్త్రవేత్తలు జి.చిట్టిబాబు, పి.ఉదయ్‌బాబు, కోపరేటివ్ సొసైటీ అధికారులు, ప్రైవేట్ ఎరువుల దుకాణాల యజమానులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

హామీలను అమలు చేస్తున్నాం

ప్రభుత్వ విప్ బెందాళం అశోక్

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నీ టిడిపి కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని శాసనాంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో పరిపాలన సాగిస్తోందన్నారు. వైసిపి హయాంలో రాష్ట్రం విధ్వంసం నుంచి నేడు అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందని తెలిపారు. విపక్షాలు ఎన్ని ఆరోపణలు చేసినా అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను గ్రామస్తులు విప్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం టి.బరంపురంలో పర్యటించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఎల్.పద్మనాభం, పిఎసిఎస్ అధ్యక్షులు పెద్దిన బాబ్జీ, ఎఎంసి చైర్మన్ మణిచంద్ర ప్రకాష్, దక్కత కామేశ్వరరావు, దక్కత ఢిల్లీరావు, మెరుగు సూర్యనారాయణ రెడ్డి, డి.సూర్యనారాయణ రెడ్డి, సాడి సహదేవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ప్రదర్శిస్తున్న ప్రభుత్వ విప్ అశోక్

న్యాయవాదుల రక్షణ చట్టం చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్, ఇచ్ఛాపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం న్యాయవాదుల రక్షణ చట్టం చేయాలని బార్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్, ఎపి బిసి న్యాయవాదుల సంఘం సంయుక్త ఆధ్వర్యాన న్యాయవాదులు జిల్లా కోర్టు మెయిన్ గేటు వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. న్యాయవాదుల మరణం తర్వాత వారసులకు చెల్లించే పరిహారం రూ.పది లక్షలకు పెంచాలని, ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.పది వేలు వృత్తిపరమైన సహాయం అందజేయాలని కోరారు. విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఎల్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.అన్నం నాయుడు, బిసి న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు, ఐఎఎల్ గౌరవాధ్యక్షులు గేదెల ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్, బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజ్ పాత్రో, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.సోమశేఖర రెడ్డి, కార్యదర్శి కామేష్, ఐఎఎల్ సభ్యులు ఎం.రాంబాబు, ఎ.భైరాగి తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం లీగల్ : నిరసన తెలుపుతున్న న్యాయవాదులు


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర్ రెడ్డి

ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

ఎస్‌పి కె.వి మహేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి- పలాస

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో వచ్చే ప్రజా ఫిర్యాదులను పూర్తిస్థాయిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వర్ రెడ్డి కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిసర ప్రాంత ప్రజలు సౌకర్యార్థం ప్రతి శుక్రవారం కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను విని, సానుకూలంగా స్పందించి పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కారం అందిస్తామని భరోసా ఇచ్చారు. తక్షణమే ఆయా ఫిర్యాదులను సంబంధిత పోలీస్ అధికారులకు తెలిపి చట్ట ప్రకారం విచారణ జరిపి త్వరితగతిన పరిష్కారం అందించాలని ఆదేశించారు. ప్రత్యేకంగా నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సివిల్, కుటుంబ కలహాలు, ఆస్తి, కొట్లాట, మిస్సింగ్, ఇతరత్రా అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నివేదిక రూపంలో నిర్ణీత సమయంలో జిల్లా పోలీసు కార్యాలయానికి అందజేయాలని ఎస్‌పి సూచించారు.


ఆర్థికసాయం అందజేస్తున్న మాణిక్యేశ్వరి సంస్థ సభ్యులు

భీముడుకి అండగా...

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

కవిటి: మాణిక్యపురం గ్రామానికి చెందిన రామిశెట్టి భీముడుకు మా మాణిక్యేశ్వరి స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది. కాలేయ వ్యాధితో బాధపడుతున్న భీముడి దయనీయ పరిస్థితిని 'అయ్యో.. ఎంత కష్టం' అంటూ ప్రజాశక్తి శుక్రవారం కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన మా మాణిక్యేశ్వరి స్వచ్ఛంద సంస్థ సభ్యులు శుక్రవారం గ్రామానికి చేరుకుని భీముడి కుటుంబ సభ్యులను కలుసుకున్నారు. తమవంతుగా రూ.17,500లు అందించి అండగా నిలిచారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యుడు రాజేష్ మాట్లాడుతూ ఒకపక్క కాలేయ వ్యాధి, మరోవైపు జాండిస్‌తో భీముడు పోరాడుతున్నట్టు తెలిపారు. ఇప్పటికే కూతురు చనిపోయిన బాధలో ఉన్న ఆ కుటుంబానికి భీముడు అనారోగ్యం అగాధంలోకి నెట్టేసిందని అన్నారు. భీముడు వైద్యం కోసం చాలా మొత్తం ఖర్చవుతుందని, ఇటువంటి దయనీయ పరిస్థితిలో స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి వారికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


గ్రామంలో పర్యటిస్తున్న శ్రీకాంత్

శ్రీకాంత్ పరామర్శ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని దుర్బలాపురం, పద్మ, సానిపాలెం గ్రామాల్లో రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్ శుక్రవారం పర్యటించారు. దుర్బలాపురం గ్రామానికి చెందిన రాడ ఢిల్లేశ్వరరావు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అలాగే పడాల తారక్ తల్లి రోజమ్మ ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఆమెను పరామర్శించి ఓదార్చారు. సానిపాలెం గ్రామానికి చెందిన ఆసరి లచ్చమ్మ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే ఉర్లన జగ్గారావు ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఆయనను పరామర్శించారు. పద్మ సర్పంచ్ మజ్జి రామచందర్ బంధువు అప్పిలి మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈయనతో వైస్ ఎంపిపి ప్రతినిధి పాడి అప్పారావు, ఎంపిటిసి ఉర్లాన ఋషి, సర్పంచ్‌లు గణేష్ ప్రధాన్, బోసి రామారావు, మజ్జి రామచందర్, సవర భాస్కరరావు, పెద్ద బొంతు అప్పారావు, సలాణ సత్యం, ఇసై ఢిల్లేశ్వరరావు, నక్క వెంకటరావు, రవ్వల దుర్యోధన, గొర్ల శ్రీను, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కెజిబివి ఎస్‌ఒపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ప్రసాద్

కొత్తూరు: మండలంలోని వసప కెజిబివి ఎస్‌ఒ పల్ల రాధికపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత, వెనుక బడిన తరగతులకు చెందిన నిరుపేద విద్యార్థులకు సరైన భోజన సదుపాయాలు కల్పించకుండా విద్యార్థులు పొట్టగొడుతున్నారని, అక్కడ చదువుతున్న విద్యార్థులతోనే పనులు చేయించటం, బెదిరించటం చేస్తూ గత మూడు నెలలుగా ఎస్‌ఒ తీరుపై విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు ఆందోళన ఫలితంగా గురువారం జిల్లా అధికారులు వసప కెజిబివి స్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి వివరాలు సేకరించారన్నారు. విద్యార్థులతో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న తీరుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం కోసం పంపిన సరుకులు తరలింపుపై సమగ్ర దర్యాప్తు చేయాలన్నారు. లేకుంటే ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.

ప్రమాదకరంగా భారీ వాహనాల ప్రయాణం


గుంతల రోడ్డుపై ప్రయాణిస్తున్న లారీలు

సంతబొమ్మాళి : మండలంలోని నౌపడ మూడు రోడ్లు కూడలి నుంచి ఉప్పు గల్లీలకు వెళ్లే మార్గంలో భారీ వాహనాల ప్రయాణంతో స్థానికులు భయ భ్రాంతులకు గురవుతున్నారు. ఇదే మార్గంలో ఖాళీగా లారీలు వెళ్లి ఉప్పు గల్లీలో ఉప్పుని లోడ్ చేసి ఇదే మార్గం గుండా వస్తున్నాయి. ఎన్నో ఏళ్ల కిందట నిర్మించిన గ్రావెల్ రోడ్డు గుంతలమయంగా మారడంతో భారీ వాహనాలు గుంతల్లో దిగి ప్రమాదకరంగా ఊగుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని మూడురోడ్లు కూడలి వద్ద నివాసాల్లో ఉంటున్న స్థానికులు గిన్ని నర్సింహమూర్తి, రాజు, మహంతి సోమేష్ తదితరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికలోడుతో వస్తున్న వాహనాలను సీతా నగరం వైపునకు తరలించాలని అధికారులను వేడుకుంటున్నారు.

సురేఖ పాణిగ్రాహికి కన్నీటి వీడ్కోలు

వామపక్ష, ప్రజాసంఘాల నాయకుల నివాళి

ప్రజాశక్తి- పలాస

పలాస మండలం బొడ్డపాడులో విప్లవ కవి, శ్రీకాకుళ సాయుధ పోరాట యోధుడు సుబ్బారావు పాణిగ్రాహి జీవిత సహచరిని సురేఖ పాణిగ్రాహి అంత్యక్రియలు శుక్రవారం జరిగాయి. ముందుగా బొడ్డపాడు అమరవీరుల స్మారక భవనం వద్ద సంతాప సభ నిర్వహించారు. ఈ సంతాప సభకు అమరుల బంధుమిత్రులు, సంఘం నాయకులు తామడ త్రిలోచనరావు అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోనారి మోహనరావు, ఎపి జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, సిపిఎం నాయకులు ఎన్.గణపతి, బమ్మిడి ఆనందరావు, నెయ్యిల మోహనరావు, ఎన్.చంద్రయ్య, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామడ సన్యాసిరావు, మద్దిల రామారావు, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్రి దానేషు, పిడిఎం రాష్ట్ర నాయకులు సాలిన వీరాస్వామి, అరుణోదయ సాంస్కృతి సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ప్రజా కళామండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కొర్రాయి నీలకంఠం, పికెఎస్ జిల్లా అధ్యక్షులు ధర్మారావు, దాసరి శ్రీరాములు, విరసం జిల్లా కార్యదర్శి కృష్ణారావు, దున్న గోవిందు, కోనేరు గురయ్య, నిరంజన్ పాణిగ్రాహి తదితర వక్తలు మాట్లాడుతూ శ్రీకాకుళ సాయుధ పోరాట కాలంలో ప్రజల పక్షాన తన కలాన్ని, గళాన్ని జల్పించిన పాణిగ్రాహి ఆయన జీవిత సహచరిణి ప్రత్యక్షంగా ఉద్యమంలో పాల్గొకపోయినా పరోక్షంగా విప్లవ ఉద్యమానికి అన్ని రకాల సహకారాలు అందించారని వక్తలు కొనియాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసులను అంతం చేస్తూ అనేక బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్న కాలంలో మోడీ, అమిత్‌షా హిందుత్వాన్ని ముందుకు తెస్తున్న సందర్భంలో సురేఖ పాణిగ్రాహి అమరత్వం తీరని లోటన్నారు. సురేఖను స్మరించుకోవడం అంటే గత ఉద్యమాన్ని నెమరు వేసుకోవడమేనన్నారు. అమరుల త్యాగాలు వృధా కావని, అమరులు చూపిన బాటలో పయణించాలన్నారు. కార్యక్రమంలో డిటిఎఫ్ నాయకులు కోత ధర్మారావు, జోగి కోదండరావు తదితరులు పాల్గొన్నారు.


సంతాప సభలో పాల్గొన్న నాయకులు

విద్యా సామగ్రి పంపిణీ

టెక్కలి: మండలంలోని తలగాం ఎట్ నౌపడ ఆర్‌ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బిగ్‌హెల్ప్ అసోసియేషన్ సంస్థ ఆధ్వర్యంలో 15 మంది విద్యార్థులకు చదవులకు అవసరమైన విద్యాసామగ్రిని శుక్రవారం పాఠశాల హెచ్‌ఎం ఎస్.అమ్మనమ్మ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్థ దాతృత్వాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. ప్రాజెక్టు డైరెక్టర్ బోడ్డేపల్లి విద్యావతి మాట్లాడుతూ తమ బిగ్‌హెల్ప్ సంస్థ ద్వారా ప్రతినెలా విద్యార్థులకు సామగ్రి అందిస్తామని, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు విద్యారుణాలు కూడా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లత, లక్ష్మణరావు, నరసింహమూర్తి, తిరుపతిరావు విద్యార్థులు పాల్గొన్నారు.



టార్పాలిన్లు పంపిణీ చేస్తున్న అధికారులు

జీడి రైతులకు టార్పాలిన్లు పంపిణీ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని బాతుపురం జీడి రైతులకు రూ.1600 విలువ చేసే 24 టార్పాలిన్లును ఎపిఎం గొడబ ప్రసాదరావు చేతులమీదుగా రైతు ఉత్పత్తిదారుల సంస్థ కార్యాలయంలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడి రైతులు తమ ఉత్పత్తులను వర్షం, మంచు నుంచి కాపాడుకోడానికి టార్పాలిన్లు ఉపయోగపడతాయన్నారు. సూర్యరశ్మి తగిలి జీడి పిక్కలు రంగు మారకుండా టార్పాలిన్లు కప్పి ఉంచాలని సూచించారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థ కార్యాలయంలో టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్‌పిఒ బత్తిన హేమ, రైతు మిత్ర ధర్మారావు, అకౌంటెంట్ సౌజన్య, సిసి హరిప్రియ, రైతులు పాల్గొన్నారు.


ఎరువులు పంపిణీ చేస్తున్న నాయకులు

ఎరువుల పంపిణీ

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని దిమ్మిలాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలోగల గ్రామాలకు డిఎపి, యూరియాను శుక్రవారం మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు, టిడిపి మండల అధ్యక్షులు పి.అజయ్ కుమార్, టిడిపి నాయకులు ఎం.బాలకృష్ణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు ఎరువు అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.చంద్రశేఖరరావు, ఎస్.దామోదరరావు తదితరులున్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న వైద్యాధికారి భాగ్యశ్రీ

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

వర్షాకాలం వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని లింగాలవలస పిహెచ్‌సి డాక్టర్ భాగ్యశ్రీ అన్నారు. శుక్రవారం టెక్కలి అయ్యప్ప నగర్‌లో ఉన్న బిసి బాలుర వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులను అవగాహన కల్పించారు. చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, వేడినీరు తాగాలని సూచించారు. వాటర్ ట్యాంక్‌లో క్లోరినేషన్ చేయించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈమెతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు సీజ్


కొత్తూరు : గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ, సిబ్బంది

కొత్తూరు: మండలంలోని కర్లమ్మ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో శుక్రవారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చింతాడ ప్రసాదరావు ఆధ్వర్యంలో కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులు లేని ఐదు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు సిఐ తెలిపారు. గ్రామంలో మద్యం అక్రమ నిల్వలు, గంజాయి, నిషేధిత మత్తు పదార్థాలు వంటి వాటిపై సోదాలు చేశారు. అలాగే అపరిచిత వ్యక్తులు ఉన్నట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామస్తులకు దొంగతనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహమ్మద్ అమీర్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని మలకాంలో ఎస్‌ఐ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. ముమ్మరంగా తనిఖీలను పోలీసులు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వీధుల్లో తిరుగుతూ ద్విచక్ర వాహనాల వివరాలను నమోదు చేశారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేని ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు.


పొందూరు : గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ సత్యనారాయణ

ముత్యాలమ్మ కోనేరు అభివృద్ధికి కృషి


నాగేశ్వరరావును సత్కరిస్తున్న బాబూరావు తదితరులు

పలాస: పలాస కాశీబుగ్గ జంట పట్టణాల మధ్య అతిపెద్ద విస్తీర్ణంలో గల ముత్యాలమ్మ కోనేరు (నెహ్రూ పార్క్) అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు అన్నారు. శుక్రవారం విశ్రాంత ఉపాధ్యాయుడు బమ్మిడి నాగేశ్వరరావు సుమారు రూ.16 వేలతో పార్కు చుట్టూ నిర్మించిన మంచినీటి కొళాయిలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీకి మొట్టమొదటి చైర్మన్‌గా తాను ఉన్నప్పుడు పార్కు అభివృద్ధికి ఎంతో కృషి చేశానని, శతాబ్దాల చరిత్ర కలిగిన పార్కు ప్రదేశ ప్రాముఖ్యతను గుర్తు చేశారు. ప్రభుత్వ పరంగా పార్కు మరింత సుందరీకరణ చేసే దిశగా తనవంతు పూర్తి సహకారం ఉంటుందన్నారు. దీనిపై ఎమ్మెల్యే శిరీషా, మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావుల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. పార్కు అభివృద్ధిలో భాగస్వామిగా నిలిచిన బమ్మిడి నాగేశ్వరరావును మెమెంటోతో పాటు దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పండిత రాజేంద్ర, హనుమంతు మురళీమోహన్ దొర, బోయిన సత్యానందం, సిహెచ్ వాసు, దడియాల నరసింహులు, లండ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

స్టెమ్ ల్యాబ్‌తో విద్యార్థులకు మేలు

ప్రజాశక్తి- రణస్థలం

స్టెమ్ ల్యాబ్ విద్యార్థులు భవిష్యత్ సిద్ధం కావడానికి సహాయపడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య అన్నారు. మండల కేంద్రంలో ఉన్న ఐరిస్ సాకల్య పాఠశాలలో స్టెమ్ ల్యాబ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టెమ్ అనే సంక్షిప్త పదం సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్‌ను సూచిస్తుందన్నారు. స్టెమ్‌ల్యాబ్ విద్యార్థులు ప్రాజెక్టులలో పాల్గొనడానికి, ఆచరణాత్మక నైపుణ్యాలను, శాస్త్రీయ, గణిత భావనలపై లోతైన అవగాహనను పెంపొందించడానికి ఒక ప్రత్యేక స్థలమన్నారు. టెక్నాలజీలో నూతన పోకడలకు అనుగుణంగా విద్యార్థులను తయారుచేసే బాధ్యతను పాఠశాల యాజమాన్యాలు తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాల్లో కూడా అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ద్వారా విద్యార్థులకు రోబోటిక్స్‌పై విద్యార్థులకు బోధన అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కుమారస్వామి, మండల విద్యాశాఖాధికారి ఎ.త్రినాథరావు, అప్సా నియోజకవర్గ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, న్యూరే ఎనర్జీ సొల్యూషన్స్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సంతోష్, పాణి గ్రహి, కళా వెంకటరావు, యూలో పబ్లికేషన్ ప్రతినిధులు నాయక్, సంతోష్, ఎసిఎఫ్ స్టడీ సెంటర్ ప్రతినిధి శేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


స్టెమ్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డిఇఒ తిరుమల చైతన్య

పేదలను ఆదుకుంటాం



నరసన్నపేట : సిఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి- నరసన్నపేట

అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి సిఎం సహాయనిధి నుంచి మంజూరు చేసిన చెక్కులను టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అందజేశారు. ఇందులో భాగంగా కొమనాపల్లికి చెందిన కెల్ల రోహిత్ కుమార్‌కి రూ.70 వేలు, పర్లా మాకివలసకు చెందిన శిమ్మ సూర్యనారాయణకు రూ.48,184, చల్ల కోమలకు రూ.85,020, కూర్మనాథపురానికి చెందిన మొయ్యి గోవిందరావుకు రూ.57,348 ముంజూరు చేసిన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం సహాయనిధి ద్వారా ఎందరో పేదలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుతున్నాయన్నారు.

రణస్థలం రూరల్: శ్రీకాకుళం వత్సవలస యాత్రకు వెళ్లి మరొకరి ప్రాణాలను కాపాడే ప్రయత్నంలో తన ప్రాణాలను కోల్పోయిన జి.సిగడాం మండలం దేవరవలసకు చెందిన యువకుడు పడమటి అశోక్ ఆ కుటుంబానికి ఆధారమని గ్రామ పెద్దలు ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలియజేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సిఎం సహాయనిధి నుంచి రూ.2 లక్షలు మంజూరు చేయించారు. శుక్రవారం ఆ కుటుంబం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఎన్ఇఆర్‌ని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరావు మాస్టర్, జక్కంపూడి దాసు, కుమరాపు రవికుమార్, బుజ్జి, జనసేన పైడిరాజు తదితరులున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆర్‌టిసి డిపోలో జైభీమ్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా బి.ధనుంజయ రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జై భీమ్ అసోసియేషన్ డిపో కార్యదర్శిగా జివన్ భూషణ్, డిపో అధ్యక్షులుగా బిడి రావు, డిపో చైర్మన్‌గా ఆర్.గణపతిరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎల్.త్రినాథరావు, ఉపాధ్యక్షులుగా పివి రావు, జాయింట్ సెక్రటరీగా ఎస్.రామారావు, ట్రెజరర్‌గా ఎస్ఆర్ కుమార్, జాయింట్ సెక్రటరీగా జి.అసరయ్య, వై. కూర్మారావు, కమిటీ సలహా దారులుగా వి.కె.దేవ్, ఆర్‌పి రావు, బిఎ రావు, డి.ఎర్రయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎపి పిటిడి ఉద్యోగుల కొరకు నిరంతరం పనిచేస్తామన్నారు.


ధనుంజయరావు, కార్యదర్శి

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం


కోటబొమ్మాళి : ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

కోటబొమ్మాళి: మండలంలోని దంత గ్రామ ఎంపియుపి పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేసి ఇటీవల వేరువేరు గ్రామాలకు బదిలీపై వెళ్లిన నలుగురు ఉపాధ్యాయులకు శుక్రవారం దంత పాఠశాల అవరణలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు, ఎంఇఒలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు సిహెచ్ గోవిందరావు, ఎల్.వి.ప్రతాప్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల్లో పోటితత్వం ఏర్పడిందని, క్రమశిక్షణతో వారి విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ పాఠశాలకు గతంలో మూడు పర్యాయాలు తనిఖీలకు వచ్చామని భోధన విషయంలో, రికార్డుల నిర్వహణలో ఎలాంటి సమస్యలు లేవన్నారు. బదిలీపై వెళ్లిన గొండు నారాయణరావు, డి.జ్యోతి, గణేష్, వేణుగోపాలరావు సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నక్క కృష్ణ, శిమ్మ వెంకటరావు, జనసైనికులు దుంగ మహేష్, నక్క సోమేష్, దుబ్బ రామారావు, స్థానిక ఉపాధ్యాయులు తవిటి నాయుడు, సూర్యనారాయణ, నిర్మల, రామారావు పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలోని గులివిందల పేట-1 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేసే బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు చింతాడ సురేష్ బాబు, శాంతారాం, ఎం.సుధాకరరావులను స్థానికులు దుశ్శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగలు చేసిన సేవలే వారిని ఉన్నత స్థానంలో నిలబెడతాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం లలిత, ఉపాధ్యాయులు పుష్పకుమారి, స్వర్ణలత, రాజేష్, నాగభూషణం పాల్గొన్నారు.

లావేరు: మండల కేంద్రం లావేరు జెడ్‌పి పాఠశాలలో పనిచేసి ఇతర పాఠశాలకు బదిలీపై వెళ్లిన పదిమంది ఉపాధ్యాయులను పాఠశాలలో హెచ్‌ఎం పి.జగన్నాథరావు, ఉపాధ్యాయులు దుశ్శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు కర్రి కృష్ణ, ఎస్ అరుణ, బి.సరస్వతి, ఎం.ఆచలజ, జి.సూర్యారావు, ఎస్.గోవిందరాజులు, ఎం.దేవ్, కె.రవిశంకర్‌లను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి పి.శ్రీనువాసరావు, పి.వసంతరావు, కె.సత్యనారాయణ, వి.నాగరాజు, కె.నారాయణబాబు, జె.శ్రీదేవి, ఎస్.దేవి, వరలక్ష్మి పాల్గొన్నారు.


సోంపేట : ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది


లావేరు : ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

సోంపేట: మండలంలోని గొనకపాడు ఉన్నత పాఠశాలలో పనిచేసి, ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను స్థానిక సిబ్బంది, గ్రామస్తులు సత్కరించారు. పాఠశాలకు చెందిన పి.సూర్య ప్రభాకర్‌రావు, బాలకృష్ణ, సూర్యనారాయణ, శ్రీను, ఆనంద్ సింహాచలం, కిషోర్, మీన కేతనరావు, లక్ష్మీ, సుజాతలను దుశ్శాలువలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బందితో పాటు ఎంఇఒ జోరాడు, హెచ్‌ఎం కృష్ణారావు, రామ్ బుడ్డి గణపతి, సంగారు రామస్వామి, తులసీరావ్, బాలరాజు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


గోవిందరావు (ఫైల్)

ప్రజాశక్తి- రణస్థలం

విద్యుదాఘాతానికి గురై రాడ్ బెండింగ్ కాంట్రాక్టర్ మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని రణస్థలంలో శుక్రవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఇంటి యజమాని అదపాక పైడిరాజు తెలిపిన వివరాల మేరకు విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం జోగిరాజుపేటకు చెందిన రాడ్ బెండింగ్ కాంట్రాక్టర్ కళ్యాణపు గోవిందరావు (45) రణస్థలంలో అదపాక పైడిరాజు నూతనంగా ఇంటి నిర్మాణం పనులు నిమిత్తం రాడ్ బెండింగ్ కాంట్రాక్టు పనులు చేస్తున్నారు. అయితే శుక్రవారం ఎప్పటిలాగే నిర్మాణం జరుగుతున్న ఇంటిపై రాడ్ బెండింగ్ పనులు చేస్తుండగా ఇంటిపైనుంచి వెలుతున్న విద్యుత్ వైరు తగిలి విద్యుదాఘాతానికి గురైయ్యారు. తీవ్రంగా గాయపడిన గోవిందరావును తక్షణమే శ్రీకాకుళం సర్వజనాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ గోవిందరావు మృతి చెందాడు.

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె


తలకొరివి పెడుతున్న ఇందు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలం మెట్టూరు గ్రామ పంచాయతీ ఒంక లూరు గ్రామానికి చెందిన దుమ్ము రాజు, లక్ష్మీ దంపతుల కుమార్తె దుమ్ము ఇందు తన తండ్రికి శుక్రవారం వంకులూరు స్మశాన వాటికలో తలకొరివిపెట్టారు. ఇందు తల్లి లక్ష్మీ పదిరోజుల క్రితం కిడ్నీవ్యాధితో మరణించగా మనస్థాపానికి గురైన భర్త ఆరోగ్యం క్రమేణా క్షీణించి కన్నుమూశారు. వారికి ఏకైక కుమార్తె కావడంతో తన తండ్రికి ఆమె శుక్రవారం తలకొరివి పెట్టారు.

నలుగురు జూదరుల అరెస్టు

రణస్థలం: జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవరాపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.12,420 నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే నాలుగు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లు సీజ్ చేసి పోలీస స్టేషన్‌కు తరలించారు. మరికొంత మంది జూదరులు తప్పించుకు పారిపోయారని తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు. ఈ దాడిలో జె.ఆర్.పురం ఎస్‌ఐ ఎస్. చిరంజీవి, ఎఎస్‌ఐ ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీపై ఫిర్యాదు

బూర్జ: మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో పరికరాల చోరీపై ఎంపిడిఒ తిరుపతిరావు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రవల్లిక తెలిపారు. ఇన్వెర్టర్‌తో పాటు రెండు బ్యాటరీలు చోరి అయినట్లు పేర్కొన్నారు. గతేడాది ఇదే కార్యాలయంలో పలు పరికరాలు చోరీకి గురైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఇందులో కంప్యూటర్లతో పాటు ఫ్యాన్లు, పరికరాలు చోరీకి గురైనట్లు స్థానికులు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో వరుస దొంగతనాలు జరుగుతు ఉడడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

'నారాయణపురం' నీరు విడుదల

ఎచ్చెర్ల: రైతు రాజు కావడమే ప్రభుత్వ లక్ష్యమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం నారాయణపురం కుడికాలువ ద్వారా అందుబాటులోకి వచ్చిన సాగునీటికి నవభారత్ జంక్షన్, కుశాలపురం పంచాయతీ వద్ద ఎమ్మెల్యే జలహారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, రైతులు, అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రతి సమస్యా పరిష్కరిస్తాం

ఆమదాలవలస: సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమంలో సమస్యలపై వచ్చే ప్రతి అర్జీని పరిష్కరిస్తామని టిడిపి జిల్లా కార్యదర్శి మొదలవలస రమేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షులు నూకరాజు ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీకి చెందిన పలువురు తమ సమస్యలపై వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో పివికె రాజు, నాగళ్ల మురళీధర్ యాదవ్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నేడు లక్కవరంలో తొలి అడుగు

సోంపేట: మండలంలోని లక్కవరంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు మద్దు కుమార్ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ తొలి సంవత్సరంలో లక్కవరం గ్రామానికి సుమారు రూ.2 కోట్లతో అభివృద్ధి పనులను మంజూరు చేసినట్లు తెలిపారు. వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలతో పాటు, మరికొన్ని పనుల నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమానికి సోంపేట మండల కూటమి నాయకులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

రైతుసేవా కేంద్రానికి యూరియా

లావేరు: మండల కేంద్రం లావేరు పంచాయతీ రైతుసేవా కేంద్రానికి యూరియా వచ్చినట్లు విఎఎ ఆర్.సుమాంక తెలిపారు. రైతు సేవాకేంద్రంలో 444 బస్తాలు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు 26న శనివారం రైతుసేవాకేంద్రంలో సంప్రదించాలని తెలిపారు. ఒక్కో రైతుకి ఒక ఎకరాకు ఒక బస్తా, అంతకు మించి ఎంత ఎక్కువ భూమి ఉన్నా రెండు బస్తాలు చొప్పున ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులు తమ ఒన్‌బిలు తీసుకు రావాలన్నారు.

వర్షపునీటితో తప్పని ఇక్కట్లు

నరసన్నపేట: ఇటీవల కురుస్తున్న కుండపోత వర్షాలతో పట్టణంలో కొన్ని వీధుల్లో ముదుకులోతు నీరు నిల్వఉండి స్థానికులకు ఇక్కట్లు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కలివరపుపేట, జోగిపేట, కొత్తవీధి, కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండి మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. దీంతో దోమలు చేరి విషజ్వరాలు విజృంభిస్తున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారం చేయాలని పలువురు కోరుతున్నారు.


కలివరపుపేట వీధిలో నిల్వ ఉన్న నీరు

గురుకుల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



గురుకుల పాఠశాల మెస్‌లో భోజనం చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - బూర్జ

గురుకుల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మండలంలోని కొల్లివలసలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను శుక్రవారం సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ వారి అభిరుచులు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత వంటగది, భోజనశాల, నిల్వ గదులను పరిశీలించిన కలెక్టర్... వంటశాల పరిశుభ్రతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోసారి ఇదే పునరావృతమైతే చర్యలు తప్పవని కిచెన్ సిబ్బంది, కేర్ టేకర్‌కు హెచ్చరించారు. కోడిగుడ్ల పరిమాణం, మెస్ రికార్డులు, నిత్యావసర సరుకుల నిల్వలు, నిర్వహణను తనిఖీ చేశారు. అన్ని రికార్డులు సక్రమంగా ఉండాలని, పరిశుభ్రత పాటించాలని స్పష్టం చేశారు. గురుకులంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించడంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆదేశించారు. పాఠశాలలో పలు సమస్యలను గుర్తించిన కలెక్టర్ రూ.2.5 లక్షలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. వీటితో విద్యుత్ మరమ్మతులు, దోమల నివారణ వలలతో పాటు పారిశుధ్య మెరుగుకు వినియోగించాలన్నారు. పాఠశాల మెస్‌లో భోజనం అనంతరం హరిత హారంలో భాగంగా మొక్కను నాటారు.

బిసి వసతిగృహాలు, మోడల్ స్కూల్స్ కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయ ప్రిన్సిపాల్స్‌తో కలెక్టర్ సమీక్షించారు. వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పరిశుభ్రతపై దృష్టిసారించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించడం, వారానికోసారి నీటి నమూనాలు పరీక్షించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ జి.గ్రేసీ, ఎంఇఒలు, మండల అధికారులు, గురుకుల సిబ్బంది పాల్గొన్నారు

సైనికుల త్యాగాలు వెలకట్టలేనివి



రక్తదానం చేస్తున్న మాజీ సైనికోద్యోగులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

దేశ రక్షణలో సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన కార్గిల్ విజయ్ దివస్‌లో భాగంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భద్రత, సమగ్రత, భద్రత కోసం సైనికులు ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పిస్తున్నారన్నారు. కార్గిల్ యుద్ధంలో విజయానికి గుర్తుగా ఏటా జూలై 26న కార్గిల్ విజయ దివస్‌ను దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని మాజీ సైనికుల కోసం సంక్షేమ భవన్ నిర్మాణానికి తాను, కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు కృషి చేశామన్నారు. త్వరలో భవన నిర్మాణం పూర్తి కానుందన్నారు. అనంతరం 25వసారి రక్తదానం చేసిన విజయనగరం జిల్లా నేతాజీ ఎక్స్‌సర్వీస్‌మెన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి.మన్మథరావుకు జ్ఞాపికను అందించి ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎ.శైలజ, సంఘ చైర్మన్ పి.ఈశ్వరరావు, అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు, బి.సూర్యనారాయణ, పి.మురళీధరరావు తదితరులు పాల్గొన్నారు.



గ్యాస్ గోదామును పరిశీలిస్తున్న ఆర్‌డిఒ వెంకటేష్

గ్యాస్ గోదాం పరిశీలన

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ తాళభద్ర గేట్ సమీపంలో ఉన్న సత్యసాయి గ్యాస్ ఏజెన్సీ గోదాంను శుక్రవారం సాయంత్రం ఆర్‌డిఒ జి.వెంకటేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాంలో ఎన్ని గ్యాస్ సిలిండర్లు ఉన్నాయి, వ్యాపార గ్యాస్ సిలిండర్లు ఎన్ని ఉన్నాయి, ఏయే ప్రాంతాలకు గ్యాస్ సరఫరా చేస్తున్నారు, ఏజెన్సీ పరిధిలో ఎన్ని గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్యాస్ గోదాంలో ఉన్న గ్యాస్ సిలిండర్లు, రికార్డుల్లో ఉన్న గ్యాస్ సిలిండర్లు సక్రమంగా ఉన్నాయా లేదా పరిశీలించారు. అనంతరం ఏజెన్సీ రికార్డులను పూర్తి స్థాయిలో పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ ఏజెన్సీ నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్యాస్ అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే కఠినంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయనతో పాటు గ్యాస్ ఏజెన్సీ యజమాని రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కుట్టు శిక్షణ

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని సత్యసాయి ఆలయ ప్రాంగణంలో కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఈనెల 6న ప్రారంభించారు. ప్రతిరోజు రెండు విడతలుగా 85 మంది ఆసక్తి గల మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణలో 21 కుట్టుమిషన్లతో మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఇప్పటివరకు 85 మంది శిక్షణ పొందినట్లు ఆర్గనైజర్ మౌనిక తెలిపారు. శిక్షకులు బెహరా జ్యోతి కటింగ్ చేసే విధానం, కుట్టులో మెలుకువలు వివరిస్తున్నారు. శుక్రవారం 65 మంది హాజరై శిక్షణ పొందారు.



వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు

భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి

పొందూరు: విశ్రాంత ఉద్యోగులకు, కుటుంబ పింఛనుదారులకు శాశ్వత భవన నిర్మాణం కోసం అవసరమైన స్థలాన్ని కేటాయించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు నాలం పైడిరాజు, పి.ఎస్ ప్రకాశరావు కోరారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సంఘ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. సంఘ నాయకులు బలివాడ గోవింద రావు, వి.సూర్యారావు, పి.దివాకర్ పాత్రో, వి.వి.గోవిందరావు ఉన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఇఒలు

విద్యార్థులకు బహుమతులు అందజేత

కోటబొమ్మాళి: మండల స్థాయిలో నిర్వహించిన పోగాకు వ్యతిరేక సంతకం ప్రచారంతో మండలం కొత్తపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతికి చెందిన విద్యార్థులు టి.ఉదయ్, అందవరపు సుగుణశ్రీ గెలుపొందారు. వీరికి శుక్రవారం ఎంఇఒలు గోవిందరావు, ఎల్.వి.ప్రతాప్‌లు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అభినందించారు. కార్యక్రమంలో జిఆర్ కె.శాంతకుమారి తదితరులున్నారు.

నిరుపేద మహిళలకు ప్రభుత్వ ప్రాజెక్టు సేవలు

ఇచ్ఛాపురం: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు ప్రభుత్వ ప్రాజెక్టు సేవలు అందించడానికి బ్యాంక్ సిబ్బంది, సెర్ప్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఉదయకుమార్ సింగ్ సూచించారు. శుక్రవారం స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇచ్ఛాపురం బ్రాంచ్ సిబ్బంది, సెర్ప్ సిబ్బంది, ఆఫీస్ స్టాఫ్ సమన్వయ సమావేశం మండల మహిళా సమైక్య, వెలుగు కార్యాలయంలో నిర్వహించారు. స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఉదయ్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ ప్రతిపేద నిరుపేద మహిళలకు సకాలంలో అందించడానికి సమన్వయంతో పనిచేయాలని, ఎటువంటి సమస్యలు లేకుండా బ్యాంకు సేవలు సత్వరమే అందించాలన్నారు. విఒఎఎస్‌లు మాట్లాడుతూ బ్యాంకు లావాదేవీలు, బ్యాంక్ పాస్‌పుస్తకాలు ప్రింటింగ్, బ్యాంకు రుణాలు, పొదుపులు చెల్లింపులకు వేరొక కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సెర్ప్ ఎపిఎం ఎస్.ప్రసాదరావు, ఎస్‌బిఐ ఇచ్ఛాపురం చీఫ్ మేనేజర్ సాహు, ఫీల్డ్ ఆఫీసర్ నాగరాజు, లక్ష్మీనారాయణ, సిసిలు, విఒఎలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్ ఉదయ కుమార్ సింగ్

మోసాలకు కేరాఫ్ చంద్రబాబు



రణస్థలం : ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని అల్లివలస, కోటపాలెం గ్రామాల్లో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో బాబూ ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని వైసిపి మండల అధ్యక్షులు గొర్లె శ్రీనివాసరావు శుక్రవారం నిర్వహించారు. ముందుగా స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం నేరుగా ప్రజల వద్దకు వెళ్లి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయించి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వీడియో రూపంలో వివరించారు. కార్యక్రమంలో నాయకులు మైలపల్లి కామరాజు, పిన్నింటి సత్యం నాయుడు, మజ్జి రమేష్, నేతల కృష్ణ, మహంతి అప్పల నాయుడు, టేకు బ్రహ్మాజీ, జోగ శ్రీనివాసరావు, షేక్ సైదులు, సుంకర కిషోర్, ఉప్పాడ అప్పన్న, గొర్లె రాధాకృష్ణ, గొర్లె జగదీష్, చీకటి ఎర్రయ్య, తిరుపతినాయుడు, వెంకటేష్, దన్నాన సీతారం, మాగుపల్లి సోమయ్య, లంక అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కవిటి: మండలం కపాసుకుద్ది పంచాయతీ పరిధిలోని ముత్యాలపేట గ్రామంలో వైసిపి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తు చేస్తూ 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ" కార్యక్రమాన్ని నాల్గవ దశలో విజయవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. గతంలో ఇచ్చిన హామీలను చంద్రబాబు నాయుడు అమలు చేయని వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ప్రతి కార్యకర్తదేనని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, సర్పంచ్ కాయ దమయంతి, ఉప సర్పంచ్ పాతిన చంద్రశేఖర్, కో-ఆప్షన్ మెంబర్ పాండవ చంద్రశేఖర్, వైసిపి ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు కాయ భీమసేన్, ఎంపిటిసి టి.పార్వతి, నాయకులు జల్లు యుగంధర్, ఎన్ని అశోక్, దుద్ది ధర్మారావు, పాతిన వెంకటరావు, ఆరింగి శివాజీ, టి.రామారావు, టి ధర్మరాజు, టి.హేమ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: టిడిపి మండల అధ్యక్షుడు బి.మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో హెచ్ ఎన్ పేట, యామల పేట, ఆకాశలకవరం పంచాయతీల్లో బాబూ ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాల వసంత రెడ్డి, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కిల్లి జగన్నాయకులు, మాజీ ఎఎంసి చైర్మన్ సుగ్గు రామిరెడ్డి, మార్పు నాగ భూషణరావు, రెయ్యి రామిరెడ్డి, పాల మహేష్ రెడ్డి, బుసకల సీతారాం, సుగ్గు చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలాకి: చంద్రబాబు నాయుడు పాలనలో ప్రజలు మోసపోవడం గ్యారంటీ అని ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయుడు అన్నారు. మండలంలో రాజారాంపురం, సుసరాము గ్రామంలో బాబూ ష్యూరిటీ -మోసం గ్యారింటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం పాలనలోని వైఫల్యాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ కణితి కృష్ణారావు, వైస్ ఎంపిపి కె.తాతారావు, చింతు రాఘవరావు, ఆర్ త్రినాథరావు, చింతాడ ఉమ, ఆర్.అప్పన్న రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కవిటి: పోస్టర్లు పంపిణీ చేస్తున్న నాయకులు

టెక్కలిరూరల్ : మండలంలోని రావివలస, తొలుసూరుపల్లి, భగవాన్‌పురం, జయకృష్ణాపురం గ్రామాల్లో బాబూ ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా వైసిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సర్లాన బాలకృష్ణ, బగాది రామకృష్ణ, ఎంపిటిసి చింతాడ అప్పన్న, వైసిపి మండల అధ్యక్షుడు హనుమంతు వెంకటేశ్వరనాయుడు, సత్తారు సత్యం, తమ్మన్నగారి కిరణ్, కిల్లి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్ : టిడిపి ప్రభుత్వం అధికారం కోసం యువతకు అమలు కాని హామీల నుంచి మోసం చేసిందని వైసిపి మండల అధ్యక్షుడు చిట్టి జనార్ధన అన్నారు. మండలం పరిధిలో ఒప్పంగి, పొన్నం, గేదలవానిపేట, బట్టేరులో బాబూ ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పోస్టర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ గేదెల పురుషోత్తం, రుప్పల అప్పల సూరి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



లావేరు : మాట్లాడుతున్న ఎస్ఐ లక్ష్మణరావు

ప్రజాశక్తి- లావేరు

విద్యార్థులు మాదకద్రవ్యాలు, గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఎస్ఐ గదుల లక్ష్మణరావు అన్నారు. లావేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంకల్పం కార్యక్రమంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మాదకద్రవ్యాలకు బానిస కావద్దని, మీ జీవితాన్ని బలి చేసుకోవద్దని హితవు పలికారు. సత్ప్రవర్తన, గుణాత్మక విద్య ద్వారా క్రమశిక్షణతో కూడుకున్న విద్యతో ఉన్నత శిఖరాలకు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి సైదు భాను, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిసలైతే జీవితాలు నాశనం అవుతాయని టెక్కలి సిఐ అంబటి విజయకుమార్ అన్నారు. స్థానిక బిఎస్అండ్‌జెఆర్ కళాశాలలో మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు బానిసలై అనారోగ్యానికి గురవుతున్నారని, భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారన్నారు. యువత సన్మార్గాన్ని అలవర్చుకోవాలని, పోటీ ప్రపంచానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఆయనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీకాకుళం సిటీ : అవగాహన కల్పిస్తున్న సిఐ ఈశ్వరరావు



టెక్కలి రూరల్ : మాట్లాడుతున్న సిఐ విజయకుమార్

శ్రీకాకుళం సిటీ: విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని టూ టౌన్ పోలీస్‌స్టేషన్ సిఐ ఈశ్వరరావు అన్నారు. ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు మహిళ భద్రతపై అవగాహన కల్పిస్తున్న సందర్భంగా నారీశక్తి కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆదిత్య కళాశాల విద్యార్థినులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ క్రమంలో మహిళల భద్రత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మాదక ద్రవ్యాల వలన జరిగే దుష్పరిణామాలు, సైబర్ నేరాలు, మోసాలు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



నరసన్నపేట : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట టిడిపి కార్యాలయంలో పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా జలుమూరు మండల కమిటీ, పార్టీ అనుబంధ కమిటీ నియామకంపై నియోజకవర్గ అబ్జర్వర్ కొయిలాడ వెంకటేష్, మండల అబ్జర్వర్ పిఎంజి బాబు సమక్షంలో శుక్రవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సమావేశం నిర్వహించి నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నూతనంగా ఎన్నికైన టిడిపి మండల అధ్యక్షులు వెలమల రాజేంద్రనాయుడు, ఉపాధ్యక్షులు తమన్నగారి ధనలక్ష్మి, ప్రధాన కార్యదర్శి బగ్గు గోవిందరావు, కార్యనిర్వాహక కార్యదర్శులు అక్కాజోస్యుల ఉమా దత్తుబాబు, పంచిరెడ్డి సింహాచలం, కొబగాపు ఉత్తరకుమార్, కార్యదర్శులు యజ్జల దాలయ్య, కళ్యాణం కోటేశ్వరరావు, పిరియా వెంకటరావు, కోశాధికారి రేగాన సత్యనారాయణకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జలుమూరు మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పలాస: పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. పలాస టిడిపి కార్యాలయంలో శుక్రవారం పలాస, కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కాశీబుగ్గ క్లస్టర్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, యూనిట్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, బూత్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో లొడగల కామేశ్వరరావు, బడ్డ నాగరాజు, మల్లా శ్రీనివాసరావు, కొత్త సత్యం, పైల చక్రధర్ మాస్టారు తదితరులు పాల్గొన్నారు.



పలాస : మాట్లాడుతున్న బాబూరావు

ఊపందుకున్న ఉబాలు



నాట్లు వేస్తున్న మహిళలు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. గతకొద్ది రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో వరిసాగుకు సంబంధించి ఉబాలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే పలు గ్రామాల్లో రైతులు దమ్ము ట్రాక్టర్లతో, కాడెద్దులతో పొలాలను దున్నుతుండగా, ఉబాలుకు గతంలో వేసిన వరినారును సిద్ధం చేసేపనిలో నిమగ్నం అవుతున్నారు. మరి కొంతమంది అన్నదాతలు పొలం గట్లను చదును చేసే పనిలో బిజీగా ఉన్నారు. పొలాల్లో మహిళలు ఎంతో ఉత్సాహంగా వరినాట్లు వేసే పనిలో కనిపిస్తున్నారు. ఇప్పటికే మండలంలోని తుడ్డలి, అల్లెన, వై.పర్త, తోటవాడ, కొల్లివలస, మామిడివలస, లాబాం, డొంకల పర్త తదితర గ్రామాల్లో సుమారు 3,500 ఎకరాల్లో ఉబాలు జరుగుతున్నట్లు మండల వ్యవసాయాధికారి డి.ఉషారాణి తెలిపారు.



కాడెద్దులతో దమ్ము చేస్తున్న రైతు



సురేష్‌ను సన్మానిస్తున్న శ్రీనువాసరావు, సాయికుమార్

టిడిపి మండల అధ్యక్షునికి సత్కారం

ప్రజాశక్తి- లావేరు

ఇటీవల టిడిపి మండల అధ్యక్షునిగా ముప్పిడి సురేష్‌ను తొమ్మిదోసారి పార్టీ అధిష్టానం నియమించడంతో హర్షం వ్యక్తం చేసిన తామాడ మాజీ సర్పంచ్, ఎచ్చెర్ల బిసిసెల్ అధ్యక్షుడు గొర్లె శ్రీనువాసరావు, బుడతవలస ఎంపిటిసి ముల్లు సాయికుమార్‌లు శుక్రవారం తాళ్లవలసలో సురేష్ స్వగృహంలో ఘనంగా సన్మానించారు. మెమొంటోతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి నిరంతరం అంకితమవుతున్న సురేష్ అధ్యర్యంలో పార్టీకి తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న పరమేశ్వర రెడ్డి

సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మెళియాపుట్టి మండల కేంద్రంలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరుతూ శుక్రవారం మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర రెడ్డి పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో ప్రతి గురువారం సంత జరుగుతుందని, పలు గ్రామాల నుంచి గిరిజనులు, రైతులు వచ్చి ఇబ్బందులు పడుతున్నారన్నారు. మార్కెట్, వ్యాపార సముదాయాలు, సమావేశాల కోసం ప్రాధాన్యత ఉన్నందున ఈ కాంప్లెక్స్ తక్షణం నిర్మించాలన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన నిర్మాణం చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు నంబాల వెంకటరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



బోరును ప్రారంభిస్తున్న నాయకులు

పాఠశాల ఆవరణలో తాగునీటి బోరు

ప్రజాశక్తి- కవిటి

ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల పరిషత్ నిధులు రూ.1.50 లక్షలతో వేసిన తాగునీటి బోరు శుక్రవారం ప్రారంభించారు. జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో తాగునీటి బోరుకు నిధులు మంజూరు చేసిన సందర్భంగా వారిని గ్రామస్తులు సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాయ దమయంతి, కాయ భీమసేన్, పాండవ చంద్రశేఖర్, పాతిన చంద్రశేఖర్, టి.పార్వతి, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ చిరంజీవమ్మ, టి.ధర్మరాజు, పి.వెంకటరావు, ఆర్.నారాయణరావు, జల్లు యుగంధర్, సిహెచ్ పూర్ణ, శేఖర్, పి.జయరావు, ధర్మారావు, ధనం తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- కవిటి

కవిటి గ్రామంలో దాతల సహాయంతో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ అభివృద్ధికి దాతలు అండగా నిలుస్తున్నారు. అందులో భాగంగా విశాఖపట్నంలో ఉంటున్న ఇచ్ఛాపురం మండలం పూర్ణాటకం గ్రామానికి చెందిన డి.కుమార్ రెడ్డి రూ.20 వేలు, బొరివంక గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు బల్లెడ లక్ష్మణమూర్తి రూ.10వేలు, కపాసుకుద్ది గ్రామానికి చెందిన దాస గురుమూర్తి రూ.10 వేలు, భైరిపురం గ్రామానికి చెందిన ప్రగడ ప్రసాదరావు రూ.8 వేలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బిపి రెడ్డి, మొగలిపురి సీతారాం, ఆరింగి మధు, పాండవ చంద్రశేఖర్, పొల్లాయి రుద్రయ్య తదితరులు మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో దాతల సహకారంతో ఆధ్యాత్మిక కేంద్రం ఏర్పడుతోందన్నారు. అందరి సహకారంతో తొందర్లోనే ఆలయ నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు.